
# హోటల్ అయ్యరు కూతురు

ఆకునూరి హసన్



అయిదొందల గడప ఉండే అగ్రహారంలో నిన్న మొన్నటి వరకు శేషగిరి టిఫెన్ హోటల్, ప్రేమమ్మ భోజనం హోటల్ మాత్రమే ఉండేవి.

కర్నూలు రోడ్డులో చుట్టుపక్కల ఏడెనిమిది గ్రామాలకి కూడలి ప్రాంతంగా ఉన్న అగ్రహారానికి పదిమైళ్ళ దూరంలో టౌన్ ఉండడంతో సినిమాలకీ, ఇతర పనులకీ వెళ్ళే గ్రామాల ప్రజలు తప్పనిసరిగా అగ్రహారం సెంటర్లో రోడ్డు పక్కన కాసేపు ఆగి పైనించి వచ్చే బస్సుల్లో టౌన్‌కి వెళ్తుంటారు.

మొయిన్ రోడ్డులో కాకుండా రామమందిరం వీధిలో మెడికల్ డిస్పెన్సరీ దగ్గర మూడు రోడ్ల కూడలిలోని పెంకుటింట్లో కోమటి శేషగిరి హోటల్. ప్రొద్దుట ఇడ్లీలు, కొబ్బరి, సెనగపప్పు పచ్చడి, ధనియాలకారం, ఉల్లిగడ్డ-పచ్చిమిరపకాయలు-చింతపండుతో కచ్చాపచ్చాగా నీళ్లచెట్ని. ఊకపొయ్యి పెనం మీద అటు మందంగా, ఇటు పల్చగా కాకుండా మధ్యస్తంగా అక్కడక్కడ చిల్లుల్లో లోపలివైపు ఉల్లి, మిర్చి ముక్కలు వేసి ఓ వైపు మాత్రమే ముదురు ఎరుపుగాకాల్చే మినపట్లు. మధ్యాహ్నం మూడు తర్వాత ప్రొద్దుట మిగిలిపోయిన దోశపిండి, ఇడ్లీపిండిలో ఉల్లిపాయ, మిర్చి ముక్కలు కలిపి నూనెలో దేవిన పునుగులు, ఉల్లిపకోడి, టీలు, కాఫీలూ. ఇలా శేషగిరి హోటల్ పర్మినెంట్ మెనూకి అగ్రహారం ప్రజలు కూడా ఇన్నాళ్ళూ బాగా అలవాటు పడిపోయారు.

ఆదివారాలు, సెలవరోజుల్లోనైతే కోటంశెట్టి మనవడు శేషగిరీ, పోస్ట్‌మేన్ సూర్యనారాయణ కొడుకు ప్రభు, డాక్టరుగారిబాబు, ఆయిల్‌మిల్లు గురవయ్య గారి ఆఖరి కొడుకు కన్నయ్, చాక్లెట్ పంతులు చిన్నపిల్ల సుబ్బమ్మతో సహా చాలామంది స్కూలు పిల్లలు ఉదయాన్నే శేషగిరి హోటల్‌కి వైరుబుట్టతో వచ్చి మరీ ఇడ్లీలు, దోశలు పార్సెల్ చేసి తీసుకెళ్లేవాళ్ళు.

సరిగ్గా ఇలాంటి సమయంలో టౌన్‌కి వెళ్ళే కర్నూలు రోడ్డులో ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఆగే రామారావు బట్టలకొట్టుకి పది ఇళ్ళ తర్వాత ఎడమపక్కనున్న పాతకాలపు పెంకుటింట్లోకి ఓ మధ్యాహ్నంపూట మినీ లారీలో అయ్యరు కుటుంబం దిగబడిపోయింది.

రంగూన్ టేకుతో చేసినట్లున్న నల్లటి చెక్కబల్లలు, వాటిమీద పాలరాతి లాంటి ఏకరాయిని బిగించినవి. అచ్చంగా అలాంటివే ఓ పది కుర్చీలు. పెద్ద రోలు, అల్యూమినియం గిన్నెలు, జగ్గులు, స్టీలుగ్లాసులు. ఇంకా ఏమిటేమిటో అన్నీ ఆ మినీలారీలోంచి దింపుకున్నారు. అయ్యరు, భార్యా, పెళ్ళికి ఎదిగి చాలారోజులయినట్లుగా నందివర్ధనం లాంటి కూతురూ, పొట్టిగిత్తలాగా నిక్కరులోకి చొక్కాని టక్‌చేసి స్టైల్ కొట్టే కొడుకూ.

***

ఆ మరుసటి రోజే పెంకుటింటి ముందు రెండు కర్రలు దిగేసి పెద్ద బోర్డు

దానిమీద ''అయ్యరు హోటల్'' అనే అక్షరాలు.

అగ్రహారంలో కొత్త హోటల్ వెలిసింది.

ప్రొద్దుటే ఫస్ట్‌బస్ వెళ్ళే టైమ్‌కి ఇడ్లీలు, సువాసనలు వెదజల్లే మద్రాసు సాంబారు రెడీ అయిపోయాయి.

కనిగిరి నుంచి వచ్చిన ఫస్ట్ బస్సుని మామూలుగా రామారావు బట్టల కొట్టు ముందు ఆపబోయిన డ్రైవర్‌కి వరుసగా రెండు లారీలు అడ్డం వుండేసరికి కాస్తంత ముందుకి తీసుకెళ్ళి ఆపాల్సి వచ్చింది.

సరిగ్గా రెండిళ్ళ అవతల 'అయ్యరు హోటల్' అనే బోర్డు కనిపించడంతో, సీట్లోంచి క్రిందకి దిగిన డ్రైవర్ అప్పారావు ''రాముడూ కొత్త హోటల్ పెట్టార్రోయ్'' అంటూ అప్పటికే ఆ చుట్టుపక్కల వ్యాపించిన మెడ్రాస్ సాంబార్ ఘుమఘుమల్ని ముక్కుకి పట్టించుకుంటూ ముందుకి అడుగులేశాడు. వెనక క్యాష్‌బ్యాగ్‌ని చంకలో ఇరికించుకున్న కండక్టర్ రాముడూ, ఆ వెనకాలే బస్సులోంచి ఒళ్ళు విరుచుకుంటూ, బద్ధకం వదిలించుకుంటూ దిగిన కనిగిరి, పొదిలి, చీమకుర్తి ప్రాంతాల నుంచి టౌన్‌కి వెళ్తున్న ప్రయాణీకులు ఒక్కొక్కరే బస్సు దిగి, యథాలాపంగా కొత్త హోటల్ వైపు అడుగులు వేశారు. అరుగుపక్కని సిమెంట్ తొట్టిలో నీళ్ళు, అరుగుమీద శంఖు మార్కు ఎర్రపళ్ళపొడి పొట్లాలు, సబ్బు పెట్టెలో లైఫ్‌బాయ్ సబ్బూ అన్నీ ప్రయాణీకుల్నీ తొందరపెట్టాయి.

పొడుగుచేతుల బనీను, పెద్దగా ఉన్న పొట్ట మీదకి లాక్కున్నట్లుగా పైకి లేపి లుంగీలాగా కట్టిన తెల్లటిపంచె - నుదుటిమీద విభూతినామాలు, మధ్యలో కుంకుమబొట్టు, తెల్లటి రంగులో యాభై ఏళ్ళ అయ్యరు వాకిట్లోంచి బయటకి వచ్చాడు.

''వణక్కంసామి. వాంగో... రండి... రండి ఇడ్లీ సాంబారు రెడీ అయిపుడిచ్చి. మీందే ఆలశ్యందానా. పల్లు తోముకోండి'' అంటూ సాదరంగా ఆహ్వానించాడు. అయిదు నిమిషాల్లో అయ్యరు హోటల్లోని ఖాళీ బల్లలన్నీ నిండిపోయాయి. వెనకగది లోంచి అయ్యరు భార్యా, కూతురూ ఇడ్లీల ప్లేట్లు అందిస్తూంటే, ఒక్కొకటే టేబుల్ మీద పెడుతూ, కాస్తంత లోతుగా ఉన్న స్టీలు ప్లేట్లలోని తెల్లటి ఇడ్లీలు పూర్తిగా మునిగిపోయేవరకూ చిక్కటి సాంబారు పోసి, రెండేసి స్పూన్లు అందించి ''సాపాడండి'' అనేదాకా ఇడ్లీల వంక, అల్యూమినియం మగ్గులోంచి పొగలు కక్కుతూ ప్లేట్లోకి జారిపడుతున్న ఉల్లిపాయముక్కలూ, టమోటా గుజ్జు, పచ్చిమిరపకాయలతో కూడిన ఘాటైన మద్రాస్ సాంబారు వంకా నోర్లు తెరుచుకుని చూస్తూ కూర్చున్న వారంతా ఇక తమాయించుకోలేకపోయారు.

సాంబారులో కరిగిపోతున్న ఇడ్లీ, మళ్ళీ వస్తున్న సాంబారు. అప్పటిదాకా ఎరగని రుచి కొత్త అనుభవాన్నిచ్చింది.

అగ్రహారంలో కొత్తగా అయ్యరు హోటల్ వెలిసిందని, తింటే అయ్యరు చేతి ఇడ్లీ, సాంబారు తినాలని ఆ సాయింత్రానికల్లా చుట్టుపక్కలున్న గుడిపాడు, మైనంపాడు, రుద్రవరం, చంద్రపాడు, ఎనికెపాడులాంటి చిన్న ఊళ్ళు మొదలుకుని రామతీర్థం దాకా పాకిపోయింది.

మరో రెండు రోజులకి కర్నూలు రోడ్డులో రెండు వైపుల నుంచి వచ్చిపోయే ఆర్టీసీ బస్సులు రామారావు బట్టలకొట్టు దగ్గర కాకుండా నేరుగా వచ్చి ''అయ్యరు హోటల్'' ముందు ఆగడం మొదలుపెట్టాయి.

***

అగ్రహారం హైస్కూల్లో ఎనిమిదో క్లాసు చదివే డాక్టరుగారి బాబు, హిందీ టీచరమ్మ కొడుకు అజయ్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ మేనల్లుడు శివప్రసాద్‌లతో పాటూ అయ్యర్ కొడుకు శంకరన్ అయ్యర్ జత కట్టాడు.

కర్నూలు రోడ్డుకి సమాంతరంగా రెండోవైపున ఉన్న పెద్దబజారు చివర హైస్కూల్‌కి దారితీసే డొంకలో ప్రతిరోజు డాక్టరుగారి బాబుని కలుసుకునే శంకరన్ అయ్యర్ వాళ్ళమ్మ జేబునిండా పోసి పంపిన జంతికల్నో, ఉప్పుశనగల్నో వీడికీ ఇచ్చేవాడు. హైస్కూల్లో యూనిఫామ్ వేసుకోవాల్సిన అవసరం లేనప్పటికీ నీలంనిక్కరుని రొమ్ముదాకా పైకి లాక్కుని రెండు వైపులా ఫిల్టులు, ఇస్త్రీ నలగని తెల్ల చొక్కాని లోపలికి ఇన్‌సర్ట్‌చేసి నుదుటి మీద విభూతితో అడ్డనామాలు చూడగానే అసలు సిసలైన తమిళ అయ్యంగారు పిల్లాడిలా పైలాపచ్చీస్‌గా వచ్చేవాడు శంకరన్ అయ్యర్.

''ఎనిమిదో క్లాసు చదివే ఈ పిల్లాడికి సోకులెక్కువమ్మా'' అని ఎవరైనా అంటే మరొకళ్ళు అందుకుని ''హోటల్ అయ్యరు కొడుకు మరి'' అనేవాళ్ళు. శంకరన్ అయ్యర్ తరచుగా మద్రాసు కబుర్లు చెప్పేవాడు. వాడు చెప్పే డబుల్ డెక్కర్ బస్సు ముచ్చట్లు, మూర్ మార్కెట్, బర్మాబజార్, బుహారీ హోటల్ కబుర్లు నోరుతెరుచుకుని వినేవాళ్ళు మిగతా క్లాసుమేట్లు. ఎంజీ ఆర్ సినిమాపాట ఏదో ఒకటిపాడుతూ ''నాదో పంతమా'' అంటూ నడ్డి తిప్పేవాడు.

***

ఓరోజు సాయంత్రం డాక్టర్‌గారి బాబుని తనతో ఇంటికి తీసుకెళ్ళాడు శంకరన్ అయ్యర్.

సాయంత్రంపూట హోటల్ ఉండదు కాబట్టి ముందు హాలంతా శుభ్రంగా కడిగి కుర్చీలు, బల్లలు ఓ మూలకి సర్ది ఉంచుతారు.

హాలు మధ్యలో నేలమీద చాపేసుక్కూర్చున్న శంకరన్ అయ్యర్ అక్క మీనాక్షి పూలమాల అల్లుకుంటోంది. ఎప్పుడూ లంగా, ఓణీలోనే ఉండే మీనాక్షి తెల్లటి నందివర్ధనం పువ్వులా, ముట్టుకుంటే మాసిపోతుందేమో అనిపించేలా, ఓసారి చూస్తే, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలా, అంత అందంగా కనిపించింది.

''ఇవదా డాక్టరుబాబు. ఇనకు ఫ్రెండ్. క్లాస్‌మేట్'' అక్కకి పరిచయం చేశాడు శంకరన్ అయ్యర్.


''వా. ఉకారు. బాగున్నారా?'' నవ్వుతూ పలకరించింది మీనాక్షి.

ఆమెనే చూస్తూ తలూపాడు డాక్టరుగారి బాబు.

మీనాక్షి ఓవైపు పూలమాల అల్లుకుంటూ మరో వైపు తమ్ముడితో తమిళంలో మాట్లాడుతూ వీళ్ళిద్దరూ ఇస్తున్న ఒక్కొక్క పువ్వూ అందుకుంటూ మాల మొత్తం ముగించి లేచినిలబడింది. పొడవాటి జాజిపూల మాలలోంచి రెండు ముక్కలు తుంపి మొత్తం దండంతా అదేహాల్లో గోడకి తగిలించిన గోపాలకృష్ణుడి పటానికి వేసింది.

తర్వాత లోపలికి వెళ్ళి చేగోడీలు తెచ్చి ఇద్దరికీ ఇచ్చి, వెనుక పెరట్లోకి వెళ్ళి పెద్దరోలుతో పిండిరుబ్బడం మొదలుపెట్టింది. అప్పటిదాకా నాజూకైన పూలని వేళ్ళ మధ్య సుతారంగా పట్టుకుని దారంలో బంధించి మాలగా మార్చిన మీనాక్షి




ఇప్పుడేమో మొరటైన మగాళ్లు చేయాల్సిన పిండి రుబ్బే పనిలో యాంత్రికంగా నిమగ్నమవడం – రెండింటికీ పొంతన కుదరనట్లుగా డాక్టరుగారి బాబుకి అనిపించింది.

బయట అరుగుమీద కూర్చోని రోడ్డుమీద తిరిగే లారీలు, బస్సుల్నీ లెక్కపెడుతూ చేగోడీలు తింటూ కాసేపు కూర్చున్నాక శంకరన్ అయ్యర్నీ అడిగాడు డాక్టరుగారి బాబు.

''ఒరేయ్ మీ అక్కకి పెళ్ళి ఎప్పుడు చేస్తార్రా'' అని. అప్పటిదాకా ఏదో తమిళపాటని కూనిరాగం తీస్తున్న శంకరన్ అయ్యర్ మౌనం వహించాడు.

కాసేపాగి ''మా నాన్న ఇష్టంరా'' అని మాత్రం అన్నాడు.

***

చూస్తుండగానే అయ్యరు కుటుంబం అగ్రహారం వచ్చి ఏడాది కావచ్చింది. పగలంతా హోటల్ క్లీనింగ్ పనులకి మాత్రం ఓ బుడ్డాడ్ని పనిలో పెట్టుకుని ఇడ్లీపిండి రుబ్బడంలాంటి పనుల్ని మాత్రం భార్యకీ, కూతురుకీ అప్పగించాడు అయ్యరు. పని ఎక్కువైపోవడంతో సాయంత్రం పూట కూడా తీరిక దొరకని స్థితిలో మీనాక్షి సతమతమయిపోతోంది.

ఇంతలో రైసుమిల్లు శెట్టిగారి కూతురి పెళ్లి వచ్చింది. తెనాలి నుంచి వచ్చిన మగ పెళ్ళివాళ్ళతో పాటూ అక్కడనుంచే ప్రత్యేకంగా పెళ్లికొడుకుని ఎక్కించుకుని ఓ తెల్లటి టాక్సీకారు కూడా ఊళ్ళోకి వచ్చింది.

పెళ్ళి రెండురోజులు. మొదటిరోజు పెళ్ళికొడుకుని చేసి అన్ని బజార్లలో కారులో ఎక్కించి ఊరేగించడం, ఆ తర్వాత ఎదురుకోల ఉత్సవం. ఇలా బ్యాండ్ మేళాల్తో, టపాసులతో అగ్రహారం హోరెత్తింది.

రైసు మిల్లు శెట్టిగారి చిన్నకొడుకు ఆదినారాయణ కూడా తమ క్లాసే కావడంతో డాక్టరుగారి బాబు, శంకరన్ అయ్యర్, హిందీ టీచరు కొడుకు అజయ్ పెళ్ళి ఊరేగింపులో పడి టాక్సీతో పాటూ ఊరంతా తిరిగారు. టాక్సీడ్రైవర్ పాతికేళ్ళ బాషా కూడా వీళ్ళకి బాగా నచ్చాడు. చాకులాగా, చురుగ్గా కారు స్టీరింగ్ తిప్పడం, తేనెరంగులో మెరిసే కళ్ళూ, మెళ్ళో ఏదో దర్గాలో కట్టుకున్న తావీజు అన్నీ ప్రత్యేకంగానే కనిపించాయి వీళ్ళకి.

రెండోరోజు రాత్రి పెళ్ళి ముహూర్తం అర్ధరాత్రి దాటాక. పెళ్ళికూడా కర్నూలు రోడ్డు చివర ఉన్న రైసు మిల్లులో. అమ్మా, నాన్నాలతో కలిసి పెళ్ళి భోజనం చేసి ఇంటికి వచ్చి నిద్రపోయిన డాక్టరుగారి బాబు ఎప్పుడో తెల్లారాక లేచి స్కూలుకి వెళ్తే శంకరన్అయ్యరు రాలేదు. మధ్యాహ్నానికి స్కూల్లో పెద్దపుకారు. ''శంకరన్ అయ్యరు అక్క మీనాక్షిని రాత్రి జరిగినపెళ్ళి కొడుకుతోపాటూ వచ్చిన టాక్సీ డ్రైవర్ బాషా రాత్రికి రాత్రే తనతో తీసుకెళ్ళిపోయాడని'' పిల్లలంతా ఒకటే గోల.

రెండురోజుల తర్వాత శంకరన్ అయ్యరు ఎప్పటిలాగే భుజానికి బ్యాగ్ తగిలించుకుని స్కూలుకి వచ్చాడు. రెండు క్లాసులు అయ్యాక ఇంటర్వెల్‌లో మొదటి బెంచీలో కూర్చున్న శంకరన్ అయ్యర్‌ని మిగతా పిల్లలు అల్లరిచేయడం మొదలుపెట్టారు. టాక్సీ డ్రైవర్‌తో వెళ్ళిపోయిన అక్క మీనాక్షి గురించి శంకరన్ అయ్యర్ వెనుక కామెంట్ చేయడంతో బ్యాగ్‌ని అక్కడే వదిలి క్లాసులోంచి బయటికి వెళ్ళిపోయాడు అతను. ఇది చూసిన డాక్టరుగారి బాబు తను కూడా వెనకాలే వెళ్ళాడు.

నేరుగా స్కూల్‌గ్రౌండ్‌లోని తుమ్మచెట్ల క్రింద నీడలోకి వెళ్ళి నేలమీద అటువైపు తిరిగి కూర్చున్నాడు. వెనకవెళ్ళి పక్కనేచేరి ''ఏరా బాధపడుతున్నావా వాళ్లమాటలు పట్టించుకోవద్దు'' అన్నాడు డాక్టరుగారి బాబు.

దీంతో అక్క గుర్తొచ్చిందో, మరేం గుర్తొచ్చిందో మోకాళ్ళలో ముఖం దాచుకుని బావురుమన్నాడు శంకరన్ అయ్యర్.

కొన్ని క్షణాల్లో తేరుకుని చొక్కా పైకిలాగి అంచుల్తో కళ్ళు తుడుచుకున్నాడు.

తర్వాత అన్నాడు ''ఒరేయ్ మా అక్క లేచిపోలేదురా. టాక్సీడ్రైవర్ బాషా చాలా మంచాడు. అతడినీ, మా అక్కనీ నేనే కలిపాను. బండెడు చాకిరీ తప్ప పెళ్లి చేయని మా నాన్న బారి నుంచి మా అక్కని తప్పించాను. నేనే అక్కని బాషా టాక్సీ ఎక్కించాను. ఇద్దరూ టౌన్‌లోని దర్గాలో పెళ్ళి కూడా చేసుకున్నార్రా'' చెప్పాడు.

***

మీనాక్షి వెళ్ళిపోయాక అయ్యరు హోటలు కళ తప్పింది.

దూదిపింజల్లాగా సాంబారులో కరిగిపోయే కమ్మటి ఇడ్లీలు రుచి మారిపోవడాన్ని జనమే కనిపెట్టారు. కొందరి చేతి మహత్యాన్ని ఎవరు కాదనగలరు.

సరిగ్గా, పదిరోజుల తర్వాత హోటల్ తెరవడం మానేశాడు అయ్యరు.

పదకొండోరోజు సామానంతా మినీలారీలోకి ఎక్కించి కొడుకు, భార్యాతో అగ్రహారంనుంచి వెళ్ళిపోయాడు అయ్యరు.

ఏడాదిపాటూ అగ్రహారం ప్రాంత ప్రజలకి మద్రాసు సాంబారు ఇడ్లీని అమృతంలా రుచి చూపించిన హోటల్ అయ్యరు కూతురు మీనాక్షి తప్పకుండా ఎక్కడో చల్లగా ఉండే ఉంటుంది.

★